అబ్బురం.. శిల్ప కళా సౌందర్యం

- చెన్నకేశవ స్వామి ఆలయ గాలిగోపురంపై రెండు వేల శిల్పాలు
- శనివారపుపేటలో వందల ఏళ్ల చరిత్రకు చిరునామా

ఏలూరు రూరల్ : ఏలూరు శనివారపుపేటలో ఉన్న శ్రీ చెన్నకేశవస్వామి ఆలయం ముందు వందల ఏళ్ల క్రితం నిర్మించిన గాలిగోపురంపై శిల్పకళా వైభవం అబ్బుర పరుస్తోంది. ఏళ్ల తరబడి భక్తులతో పాటు నగరవాసులను ఆకర్షిస్తోంది. రాజుల కాలంలో నిర్మించిన ఈ గోపురంపై నాటి శిల్ప కళ గుర్తుకుతెస్తోంది. సుమారు 30 అడుగుల ఎత్తున గోపురం, కింద భాగం కారురాయితో నిర్మించారు. పైభాగంలో రామాయణం, ఇతిహాసంలో అనేక కీలక ఘట్టాలు గుర్తు చేస్తూ చెక్కిన శిల్పాలు నేటికీ చెక్కు చెదరలేదు. మహా విష్ణువు, శ్రీకృష్ణుడు, శ్రీరాముడు విగ్రహాలు అత్యద్భుతంగా తీర్చిదిద్ది ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించారు. వానరుల జయజయ ధ్వానాల మధ్య 10 తలల రావణాసురుడుపై శ్రీరాముడు రామభాణం ఎక్కుపెట్టిన శిల్పం ఎంతో ఆకట్టుకుంటోంది. రాక్షసులు, దేవతలు కలిసి చేసిన క్షీర సాగర మదనం, అందులో నుంచి ఉద్భవించిన ఐరావతం, అమృతం శిల్పాలు అబ్బుర పరుస్తున్నాయి. జలక్రీడలు ఆడుతున్న గోపికల వస్త్రాలను ఎత్తుకెళ్లి, చెట్టు కొమ్మపై కూర్చుని, పిల్లనగ్రోవి వాయిస్తున్న బాలకృష్ణుడు రూపం తన్మయత్వానికి లోనుచేస్తోంది. శ్రీ మహావిష్ణువు వామన అవతారంలో బలి చక్రవర్తిని తన పాదంతో భూమిలోకి తొక్కే దృశ్యాల్ని శిల్పులు చక్కగా చెక్కారు. శ్రీరామ పట్టాభిషేకం, బాలకృష్ణుడు తాటకి వధ భక్తి భావాన్ని పెంచుతున్నాయి. వీటితో పాటు తపస్సు చేస్తున్న మునులు, మహర్షులు శిల్పాలు, కోరలు చాస్తూ భయాన్ని రేకెత్తిస్తున్న రాక్షసులు, శృంగార శిల్పాలు, నెమలి, లేళ్లు, ఆవులు, గుర్రాలతో పాటు పలు రకాలు చేతివృత్తిదారులు, సంగీత వాయిద్యకారులు శిల్పాలు నాటి ప్రజల జీవన విధానాన్ని గుర్తుచేస్తున్నాయి.

అద్భుత కట్టడం

చెన్నకేశవస్వామి ఆలయం గోపురం నిర్మాణానికి సున్నం, బెల్లం, కరక్కాయతో పాటు గుడ్డు సొన ఉపయోగించారని చరిత్ర చెబుతోంది. ఈ గోపురాన్ని ద్వారకాతిరుమల దేవస్థానం కమిటీ పర్యవేక్షిస్తోంది. పదేళ్ల క్రితం దేవదాయ శాఖ అధికారులు గోపురానికి మరమ్మతులు చేశారు. పాతకాలం నాటి విధానంలోనే శిల్పాలకు మెరుగులు దిద్దారు. గోపురం కింది భాగంలో నిర్మించిన రాతి కట్టడం మరింత బలంగా ఉండేందుకు భారీ ఐరన్ కడ్డీలు సపోర్ట్ పెట్టారు.



గోపురంపై చెక్కిన శ్రీకృష్ణుడు, గోపికులు



గోపురంపై చెక్కిన శ్రీరాముడు, రావణుడు యుద్ధం



రెండు వేల శిల్పాలతో విరాజిల్లుతున్న గాలిగోపురం



గోపురం కింద ఐరన్ డ్రిల్ అమర్చిన దృశ్యం

నైపుణ్యానికి ప్రతీక



గాలిగోపురంపై చెక్కిన శిల్పాలు అద్భుతంగా ఉన్నాయి. నాటి శిల్పుల నైపుణ్యానికి ప్రతీక. భారతీయ ఆధ్యాత్మికత, సంస్కృతి, సంప్రదాయం భావితరాలకు తెలియజేసేందుకు ఎంతో ఉపయోగపడుతుంది. గోపురం చూడగానే రామాయణం, ఇతిహాసంలోని కీలక ఘట్టాలు గుర్తుకొస్తున్నాయి.

– కేఎస్‌వీ సత్యవతి, ఉపాధ్యాయురాలు

రంగులు అద్దాలి



అపురూపమైన ఈ కట్టడాన్ని కాపాడుకోవాలి. గోపురంపై భాగంలో మొక్కలు మొలుస్తున్నాయి. అధికారులు వెంటనే వీటిని తొలగించాలి. లేకపోతే గోపురంపై శిల్పాలు దెబ్బతింటాయి. శిల్పాలు మరింత సులువుగా, స్పష్టంగా కనబడాలంటే రంగులతో ప్రకృతి పరమైన రంగులను ఉపయోగించి అందంగా తీర్చిదిద్దాలి.

– శ్రీనివాస్, ఏలూరు

క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పడిపూజ



పడిపూజలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక ఆదివారపుపేటలోని శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిర్ ఆవరణలో తల్లారి రాము గురుస్వామి ఆధ్వర్యంలో గురువారం రాత్రి అయ్యప్ప పడిపూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భవానీలు, శివ స్వాములు, సాయి స్వాములు, గోవింద స్వాములు, ఆంజనేయ స్వాములు, శ్రీ షిర్డీ సాయి ప్రేమ మందిర్ సేవకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మంగళ వాయిద్యాల నడుమ స్వాములు అనేక భక్తి పాటలు, సంకీర్తనలు ఆలపించారు. స్వాములకు, భక్తులందరికీ ప్రసాదాలు, వడైలను ఇసుకపల్లి తాతారావు ఏర్పాటు చేశారు.

మతిస్థిమితం లేని మహిళకు భరోసా



నిరాశ్రయుల హోంకు మహిళ అప్పగింత

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో మతిస్థిమితం లేని ఒక మహిళకు ఏలూరు త్రీటౌన్ పోలీసులు అండగా నిలిచారు. ఏలూరు నగరంలో ఒంటరిగా సంచరిస్తూ రోడ్డు పక్కనే జీవించే మహిళను పత్తేబాద నగర నిరాశ్రయుల హోంకు తరలించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాలతో సీఐ ఎస్ కోటేశ్వరరావు తన ఔదార్యాన్ని చాటుకున్నారు. మతి స్థిమితం లేని మహిళను నిరాశ్రయుల హోంలో చేర్పించారు. ఆమె ఏలూరు త్రీటౌన్ పరిధిలోని కలెక్టరేట్ ప్రాంతం, ఎన్ఆర్‌పేట, ఫైర్‌స్టేషన్ సెంటర్, అమీనాపేట ప్రాంతాల్లో తిరుగుతూ ఉంటుంది. ఎవరికైనా ఆమె వివరాలు తెలిసినా, బంధువులు ఎవరైనా ఉన్నా ఏలూరు పత్తేబాదలోని హోమ్‌ను సందర్శించి తెలుసుకోవాలని త్రీటౌన్ సీఐ కోరారు.

పదో తరగతి పరీక్షల ఫీజు గడువు పొడిగించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈనెల 18న ముగిసే పదో తరగతి పరీక్ష ఫీజుల గడువును ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పొడిగించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు ఒక ప్రకటనలో కోరారు. గతంలో ఆధార్ కార్డులో ఉన్న వివరాలతో సంబంధం లేకుండా పాఠశాల రికార్డుల ఆధారంగా విద్యార్థుల సమగ్ర సమాచారాన్ని ఇచ్చిన గడువుకు ముందే పూర్తి చేసుకుని ఉండేవాళ్లమని, ప్రస్తుతం అపార్ ఐడీ సమాచారంతో ముడిపడి ఉండడం వల్ల గడువుకు ముందే పూర్తి చేయడానికి అవకాశం లేకుండా పోయిందని పేర్కొన్నారు.

ఘనంగా వరి దుబ్బు నిమజ్జన కార్యక్రమం



వరిదుబ్బు పూజ చేస్తున్న మహిళలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక కొత్తపేట కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న గౌరీ శంకరుని ఆలయంలో గురువారం విశేష పూజలు చేశారు. వరి క్షేత్రం నుంచి వరి దుబ్బులను తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి, మహిళా భక్త బృందం ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల నడుమ మేళ తాళాలతో పురవీధులలో సంకీర్తనలు పాడుకుంటూ అమ్మవారి, స్వామివారి నామ స్మరణ చేస్తూ పాదయాత్రగా వెళ్లి గోదావరి, కృష్ణ కాలువల సంగమ ప్రాంతంలో నిమజ్జనం చేశారు. మహిళా భక్తబృందం ప్రతినిధి వెన్నెల కోట లతా శ్రీనివాస్ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నాన్‌స్టాప్, స్లీపర్, ఎక్స్‌ప్రెస్‌లను నిలపాలి

భీమడోలు: స్థానిక జంక్షన్, రైల్వే గేటుల వద్ద ఏపీఎస్ఆర్‌సీ నాన్‌స్టాప్, స్లీపర్, ఎక్స్‌ప్రెస్‌లను నిలుపుదల చేయాలని రాష్ట్ర ఏపీఎస్ఆర్‌టీసీ విజయవాడ జోన్ రీజనల్ బోర్డు చైర్మన్ రెడ్డి అప్పలనాయుడుకు బుధవారం భీమడోలు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. విజయవాడలో అప్పలనాయుడును కలిసి వినతిపత్రం అందించారు. ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ప్రయాణికులు, భక్తులకు ప్రధాన మార్గంగా ఉన్న భీమడోలు జంక్షన్, రైల్వే గేటుల వద్ద ఎక్స్‌ప్రెస్‌లు, స్లీపర్, నాన్‌స్టాప్ బస్సులను నిలుపుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు పి.మదన్, శ్రావణ్‌కుమార్, ఈతకోట సత్యకృష్ణ, లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే చదువు కష్టం కాదు

ఎస్పీ ప్రతాప్ శివకిషోర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇష్టపడి చదివితే చదువు కష్టమే కాదని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ అన్నారు. స్థానిక సురేష్‌చంద్ర బహుగుణ పోలీస్ స్కూల్‌లో నిర్వహించిన బాలల దినోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకొనే విషయాల్లో ఆసక్తి చూపించే విద్యార్థులను ఇస్రోకి పంపించే ఏర్పాటు చేస్తానని అన్నారు. జిల్లాలో ఏలూరు పోలీస్ స్కూల్ బెస్ట్ స్కూల్‌గా చదువుల్లోనూ, క్రీడల్లోనూ, క్రమశిక్షణలోనూ ఫస్ట్ ఉండాలని ఆకాంక్షించారు. త్వరలో పోలీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డిజిటల్ ద్వారా విద్యాభ్యాసం చేసేందుకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అదనపు ఎస్పీ అడ్మిన్ ఎన్ సూర్య చంద్రరావు మాట్లాడుతూ 20 సంవత్సరాల పాటు తలదించుకుని చదివితే 80 సంవత్సరాల పాటు సమాజంలో తల ఎత్తుకొనేలాగ పుస్తకం చేస్తుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలని కోరారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీ డి.శ్రవణ్ కుమార్, ఏఆర్‌డీఎస్పీ శ్రీహరి, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, వైవీ రమణ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్



శనివారపుపేట హాస్టల్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్



నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు

బాలల అభివృద్ధే దేశాభివృద్ధి

ఏలూరు (టూటౌన్): బాలల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అధ్యక్షతన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనం, శనివారపు పేట ప్రభుత్వ బాలుర వసతి గృహం, దొండపాడు పరివర్తన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో రత్న ప్రసాద్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, బాలల అభివృద్ధే దేశ అభివృద్ధని అన్నారు. అక్టోబర్ 21 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు మిషన్ వాత్సల్య కార్యక్రమాన్ని నిర్వహించి బాల కార్మికులను లేకుండా చేసేందుకు తనిఖీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ పి శ్రీనివాస్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీనివాస్, హోమ్ సూపరింటెండెంట్ శ్రీవల్లి, రాష్ట్ర బాలల హక్కుల మెంబర్ జె.రాజేంద్రప్రసాద్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్ కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

నెహ్రూ సేవలు మరువలేం

ఏలూరు రూరల్ : దేశం కోసం జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు మరిచిపోలేమని చాటపర్రు గ్రంథాలయ నిర్వాహకురాలు కె.వాసుకి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పుస్తక పఠనంతోనే కలెక్టర్ స్థాయికి ఎదిగా



గ్రంథాలయంలో పుస్తకం చదువుతున్న కలెక్టర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి గ్రంథాలయంలోని పుస్తకాలను పరిశీలించారు. పలు పుస్తకాలను చదివారు. చిన్నతనంలో తన తండ్రి తనకోసం తీసుకొచ్చిన పలు పుస్తకాలను గుర్తుకు తెచ్చుకున్నారు. పుస్తక పఠనం ప్రతిఒక్కరికీ అలవాటుగా మారాలని అన్నారు. జీవితంలో ఏదైనా సాధించాలంటే బలమైన సంకల్పంతో పాటు క్రమశిక్షణ, ప్రణాళిక ఉండాలని సూచించారు. సివిల్స్ సర్వీసు అనేది దేశంలోనే కఠినమైన పరీక్షని, పోటీ తీవ్రంగా ఉంటుందని తెలిపారు. పుస్తకాలు ఎక్కువగా చదవడంతోనే తాను కలెక్టర్ స్థాయికి ఎదిగినట్టు చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	32
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	34
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	23
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	31
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు – తిరుపతి	16.00	4830	31

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	30	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	40	చిక్కుడు కాయలు	92
వంకాయలు (కాంతులు)	56	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	32–60	ములక్కాడలు	07, 10
బెండకాయలు	32	కంద	80
పచ్చిమిర్చి	28	బీట్‌రూట్	60
కాకర కాయలు	34	కీరా దోస	34
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	88
బీరకాయలు (పందిరి)	34	అల్లం	80
క్యాబేజీ	32–40	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	56	పాలకూర	15
దొండకాయలు	28	చుక్కకూర	15
బంగాళదుంపలు	38	తోటకూర	15
ఉల్లిపాయలు	38–55	గోంగూర	07
గోరుచిక్కుడు	44	పుదీనా	05
దోసకాయలు	28	బఠాణి	--
ఆనపకాయ (1)	25–30	క్యాప్సికమ్	80
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

వ్యాయామంతోనే షుగర్ వ్యాధి అదుపు

గణపవరం : ప్రపంచాన్ని వణికిస్తున్న షుగర్ వ్యాధి అదుపునకు క్రమం తప్పని వ్యాయామం చేయాలని పీఎంపీ అసోసియేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి వీబీటీ రాజు అన్నారు. గురువారం గణపవరం మండలం కాశిపాడులో సహకార వారోత్సవాల్లో భాగంగా సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కె.రామలక్ష్మి అధ్యక్షతన ప్రపంచ డయాబెటిస్ డే, ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వైద్యులు 200 మందికి షుగర్, కన్ను, గుండె తదితర వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు పద్మావతి రమేష్‌రాజు, మాజీ ఎంపీటీసీ పెన్మెత్స అజయ్ కుమార్‌రాజు, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే పరమేశ్వర్లు, కార్యదర్శి సుభాన్, గణపవరం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సత్యనారాయణమూర్తి, శివశ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న రాజు

నర్సింగ్ కళాశాలలో..

దెందులూరు : స్థానిక బీఆర్‌డీ స్కూల్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో ప్రపంచ డయాబెటిస్ నివారణ డే నిర్వహించారు. గురువారం డయాబెటిస్ నివారణను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు నిఖిత, దివ్య మాట్లాడుతూ ప్రాణాలు తీస్తున్న వ్యాధుల జాబితాలో మధుమేహ వ్యాధి 9వ స్థానంలో ఉందని తెలిపారు. ఈ వ్యాధి అరికాళ్లు, కంటి నరాలు, హృదయం, మూత్రపిండాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు రూరల్ : ఏలూరు పరిసర పోణంగి అర్బన్ హౌసింగ్ లే అవుట్‌కాలనీ (జగనన్న కాలనీ) జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి గురువారం సందర్శించారు. కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లు, మౌలిక వసతుల కల్పనను పరిశీలించారు. కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు తప్పక పాటించాలని కలెక్టర్ సూచించారు. లక్ష్యం పూర్తికి గృహ నిర్మాణశాఖ అధికారులు సంబంధిత ఏజెన్సీలు, కార్మికులతో చర్చించాలన్నారు. ఎప్పటికప్పుడు పనులపై పర్యవేక్షించాలని సూచించారు. గృహ నిర్మాణంలో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉందని వివరించారు. ఈ నేపథ్యంలో మరింత వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులకు ఎస్‌జీహెచ్ రుణాలు చెల్లింపు, ఎన్ని విడతల్లో రుణం చెల్లిస్తున్నారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత లబ్ధిదారులు ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఎంబుక్, లే అవుట్‌పై ఆరా తీశారు. కలెక్టర్ వెంట హౌసింగ్ పీడీ జి.సత్యనారాయణ, నగర కమిషనర్ భానుప్రకాష్, తహసీల్దార్ శేషగిరి తదితరులు ఉన్నారు.



పోణంగి జగనన్నకాలనీలో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

ఫ్లై ఓవర్ నిర్మాణానికి అడ్డంకులు తొలగించండి



లేఖను చూపిస్తున్న మద్దా భూషణం

దెందులూరు : స్థానిక రైల్వే గేట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణానికి రైల్వే శాఖ పరంగా సహాయ సహకారాలు అందించాలని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ సాధన సమితి చైర్మన్ మద్దా భూషణం అన్నారు. విజయవాడ రైల్వే శాఖ డీఆర్ఎంకు సమాచార హక్కు చట్టంలో వినతి పత్రం అందించారు. డీఆర్ఎం నుంచి భూషణంకు గురువారం లేఖను పంపారు. ఏలూరు కలెక్టర్ కార్యాలయం రైల్వే శాఖ ఏడీఈ నుంచి సమాచారం అందుకుని తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని డీఆర్ఎం వివరించారని భూషణం తెలిపారు. ఇప్పటికే దెందులూరు రైల్వే గేటు వద్ద ఫ్లై ఓవర్ మంజూరుకు పెదపాడు, పెదవేగి, దెందులూరు, భీమడోలు మండలాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజల నుంచి సంతకాల సేకరించి ప్రజాప్రతినిధులకు ఇచ్చినట్టు చెప్పారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక రూపొందించాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీడీఓ లక్ష్మి

ఏలూరు రూరల్ : గ్రామ పంచాయతీల సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఏబీవీపీ లక్ష్మి అన్నారు. గురువారం ఏలూరు రూరల్ మండల పరిషత్ సమావేశం మందిరంలో జీపీడీపీ, బీపీడీపీపై ఒక్కరోజు మండల స్థాయి శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 2025–26 సంవత్సరంలో గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. ఇందుకోసం పంచాయతీ పాలకవర్గం, ప్రజల నుంచి వినతులు స్వీకరించాలన్నారు. గ్రామ పంచాయతీ ఆదాయం పెంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్ల నిర్వహణ నుంచి సంపద సృష్టించాలన్నారు. తాగునీటి సరఫరా, రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతుల కల్పనకు ఖచ్చితమైన ప్రణాళిక ఉండాలని తెలిపారు. ఎంపీడీఓ వి.శ్రీలత అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డీపీఓ కె.అనురాధ పరిశీలించారు.

ఏపీ క్షత్రియ సేవా సమితి డైరెక్టర్‌గా కృష్ణంరాజు

ఉంగుటూరు : నారాయణపురానికి చెందిన పాతూరి కృష్ణంరాజు ఏపీ క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందినట్టు ఆయన తెలిపారు.